వాటర్ ఫిల్లింగ్‌స్టేషన్‌కు
ప్రభుత్వ పాఠశాల స్థలం

- ఫిల్లింగ్‌స్టేషన్ ఏర్పాటు పనులను అడ్డుకున్న విద్యార్థులు
- సెలవులు కావడంతో మళ్లీ పనులను మొదలెట్టిన వైనం
- ఎకరం స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుపై స్థానికుల ఆగ్రహం


వాటర్ ఫిల్లింగ్ చేస్తున్న ట్యాంకర్లు

నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాల ప్లే గ్రౌండ్ స్థలాన్ని హెచ్‌ఎండబ్ల్యూఎస్ వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌కు కేటాయించడంతో విద్యార్థులకు ప్లేగ్రౌండ్ లేకుండా పోతుందనే విషయంపై స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పాఠశాలలకు ప్లే గ్రౌండ్స్ చాలా అత్యవసరం అన్న విషయాన్ని అధికారులు ఏ విధంగా విస్మరించారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఏర్పాటు చేసిన వాటర్ ఫిల్లింగ్ స్టేషన్‌ను తరలించి వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెలితే బాచుపల్లిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను అనుకుని ఉన్న సర్వే నం.2లో ఎకరం భూమిని హెచ్‌ఎండబ్ల్యూఎస్‌కు కేటాయిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

◆ దీంతో జలమండలి అధికారులు పాఠశాలలను అనుకుని ఉన్న ప్రభుత్వ భూమిని చదును చేసి ఫిలింగ్ స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఫిబ్రవరిలో విద్యార్థులు ఈ పనులు అడ్డుకుని నిరసన తెలియజేశారు. ఈ విషయాన్ని పలువురు గ్రామ పెద్దల దృష్టికి తీసుకువెళ్లి ప్లేగ్రౌండ్‌ను కాపాడాలని కోరారు.అంతే కాకుండా నిజాంపేట్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సైతం కార్పొరేటర్ కాసాని సుధాకర్ పలు మార్లు ఈ విషయాన్ని చర్చకు తీసుకువచ్చి సమస్య పరిష్కారించాలని కోరారు.

సెలవులు కావడంతో పనులు వేగవంతం...

ప్రస్తుతం పాఠశాలలకు సెలవులు కావడంతో జలమండలి అధికారులు ఫిల్లింగ్ స్టేషన్ పనులు వేగవంతం చేశారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులు అందుబాటులో ఉండరనే భావంతో ఎకరం స్థలం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు పనులు ప్రారంభించడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బాచుపల్లిలో మండలంలో ప్రభుత్వ స్థలం పలు ప్రాంతాల్లో ఉంది. అయినప్పటికి పాఠశాల ప్లేగ్రౌండ్‌లో ఉన్న స్థలాన్ని ఫిల్లింగ్ స్టేషన్‌కు ఇవ్వడం ఎంతవరకు సమంజసమం అని స్థానికులు వాపోతున్నారు.

విద్యార్థులకు నిత్యం ఇబ్బందులు...

పాఠశాలలో 300 మంది విద్యార్థులు ఉన్నారు. పాఠశాల కొన సాగే సమయంలో, విద్యార్థులకు ఆటలు ఆడుకునే సమయంలో ఫిల్లింగ్ స్టేషన్‌కు నిత్యం ట్యాంకర్లు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రతి విషయంలో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఏదురౌతాయాని పాఠశాల ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.చిన్న పిల్లలు ఆడుకునే సమయంలో ట్యాంకర్ల మూలంగా ప్రమాదాలు సైతం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన చెందుతున్నారు.



విద్యార్థుల సమస్యపై
సాక్షిలో ప్రచురించిన కథనం


ప్లే గ్రౌండ్‌లో ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు

ఫిల్లింగ్ స్టేషన్ వెంటనే తరలించాలి....



పాఠశాల విద్యార్థులకు ప్లేగ్రౌండ్ లేకపోతే పిల్లలు ఎక్కడకు ఆడుకుంటారు. భవిష్యత్ తరాలకు కాపాడి అందించాల్సిన ప్లే గ్రౌండ్ ఇలా ప్రభుత్వ సంస్థలకు కేటాయిస్తే కష్టం. ఫిల్లింగ్ స్టేషన్ మరోచోట ఏర్పాటు చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కాని ప్లే గ్రౌండ్ లేకపోతే విద్యార్థులు ఇబ్బందిగా ఉంటుంది. పాఠశాల అదనపు భవనాలు నిర్మించాల్సిన అవసరం వస్తే అప్పుడు కూడా ఇబ్బందే.

– కాసాని వీరేశ్ ముదిరాజ్

వేసవి సెలవుల తరువాత తరలిస్తాం.



ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు. జూన్‌లో స్కూల్స్ ప్రారంభయ్యే నాటికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లీ తప్పకుండా మరో ప్రాంతంలో ఫిల్లింగ్ స్టేషన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటా. ప్రస్తుతం ప్రజలకు నీటి అవసరం ఎక్కువగా ఉంది కాబట్టి ఇక్కడి నుంచే నీటిని ఫిల్లింగ్ చేస్తారు. సమస్యను శాశ్వతంగా పరిష్కారించే విధంగా కృషి చేస్తా.

– రామకృష్ణారావు, నిజాంపేట్ కమిషనర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సుభాష్‌నగర్: 11కేవీ కైలాష్ హిల్స్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అవాంతరాలు తలెత్తనున్నాయని గాజులరామారం సెక్షన్ ఏఈ చైతన్య భార్గవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30గంటల నుంచి 7గంటల వరకు షిర్డీహిల్స్, కైలాష్ హిల్స్, మహదేవపురం బాలయ్య బస్తీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

పేట్‌బషీరాబాద్ సెక్షన్ పరిధిలో..

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడనున్నాయని పేట్‌బషీరాబాద్ ఏఈ జ్ఞానేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ గాయత్రి నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 7.30 నుంచి 8గంటల వరకు గాయత్రినగర్ ప్రాంతం. 11కేవీ ప్రాగా టూల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు బీహెచ్‌ఈఎల్ విస్తా, ప్రాగా టూల్స్, ఎన్‌సీఎల్ గోదావరి, లక్ష్మి గంగా ఎన్‌క్లేవ్, శాంతా శ్రీరామ్ అపార్ట్‌మెంట్స్, ఆదిత్య విల్లాస్. బ్యాంక్ కాలనీ, సాయిబాబానగర్ ఫీడర్ల పరిధిలో ఉదయం 8.30 నుంచి 9గంటల వరకు వసంత్ విహార్, వసుధ అపార్ట్‌మెంట్స్, భజరంగ్ హిల్స్, సుచిత్ర సర్కిల్, వెస్ట్‌సైడ్, సర్వోత్తమ్, బ్యాంక్ కాలనీ, రాఘవేంద్ర కాలనీ, వేంకటేశ్వరకాలనీ, వాజ్‌పేయినగర్, ఎం.ఎస్.రెడ్డినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

కొంపల్లి సెక్షన్ పరిధిలో..

- విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం సరఫరాలో ఆటంకం కలుగనుందని కొంపల్లి సెక్షన్ ఏఈ వినాయక రాథోడ్ తెలిపారు. 11కేవీ దూలపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 6 నుంచి 6.30 గంటల వరకు దూలపల్లి గ్రామం, అశోకా ఏలా మైసన్ ఫేజ్–1, సెయింట్ మార్టిన్స్ కళాశాల ప్రాంతం. 11కేవీ కొంపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు సెంట్రల్ పార్క్, కుమ్మరి బస్తీ, ఆంధ్రబస్తీ, మున్సిపల్ కార్యాలయం ప్రాంతాలు. 11కేవీ జీబీఆర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు పీఎస్ఆర్ కన్వెన్షన్ రోడ్డు, రిలయన్స్ పెట్రోల్ బంక్, సయ్యద్‌నగర్, ప్యారడైజ్ రోడ్డు, టొబాకో కంపెనీ రోడ్డు, జీబీఆర్ కల్చరల్ క్లబ్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఏజీఎల్ ఫీడర్ పరిధిలో..

నిజాంపేట్: ఫీడర్ల మరమ్మతులు నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో ఆటంకం తలెత్తనుందని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఏజీఎల్ ఫీడర్ పరిధిలోని ఎస్‌బీఐ కాలనీ, ఆర్‌ఆర్‌ఆర్ వైన్స్, ఎస్‌ఆర్‌ఆర్ హైట్స్ వెంచర్ ప్రాంతాల్లో ఉదయం 8.30గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో..

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్‌లైన్ల నిర్వహణ నేపథ్యంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని భౌరంపేట్ ఏఈ సాయికిరణ్ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11కేవీ బహదూర్‌పల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి 7.30 గంటల వరకు జ్యోతిమిల్క్ సెంటర్, గాయత్రి గ్రానైట్ ఇండస్ట్రీ, ఫ్లోరా పోలిమార్ ఇండస్ట్రీ, డైమండ్ టూల్స్, మీనాక్షి ఫార్మా కంపెనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ పేర్కొన్నారు.

నేడు పుచ్చలపల్లి సుందరయ్య జయంతి

నిజాంపేట్: ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు పుచ్చలపల్లి సుందరయ్య జయంతిని గురువారం ప్రగతినగర్‌లోని సుందరయ్యభవన్‌లో నిర్వహించనున్నారు. సాయంత్రం 6గంటలకు జరిగే కార్యక్రమానికి తెలంగాణ శాసనమండలి అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి, ప్రగతినగర్ మాజీ సర్పంచ్ దయాకర్‌రెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్లు శ్రీరాములు, వెంకటరామయ్య, లక్ష్మీ కుమారి, సుజాత, వాణి ప్రసాద్‌లు హాజరు కానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సుందరయ్య జీవిత విశేషాలపై వీడియోల ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్న వారికి సత్కార కార్యక్రమాలు ఉంటాయని సుందరయ్య భవన్ నిర్వహణ కమిటీ తెలిపింది.

అధికారులు కూల్చేశారు.. తిరిగి నిర్మించాడు

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికుల డిమాండ్


ఉదయం ప్రహరీ కూల్చివేసిన అధికారులు


ప్రహరీని తిరిగి నిర్మించిన కబ్జాదారుడు

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలంలో 2000 గజాలలో ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టారు. సంబంధిత అధికారులు కూల్చివేసిన కొన్ని గంటల్లోనే సదరు వ్యక్తి తిరిగి నిర్మాణం చేపట్టి అధికారులకే సవాల్ విసిరారు. గాజులరామారంలోని సర్వే నెంబరు 79లో టీఎస్ఎస్‌ఐకి చెందిన స్థలంలో ఓ వ్యక్తి 2000 గజాలలో ప్రహరీ నిర్మించగా తహసీల్దార్ అబ్దుల్ రెహమాన్ ఆదేశాలతో గిర్దావర్ రజనీకాంత్ నేతృత్వంలో సిబ్బంది, టీఎస్‌ఐఐసీ అధికారులు, పోలీసుల రక్షణతో బుధవారం ఉదయం కాంపౌండ్ వాల్‌ను కూల్చివేశారు. అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న క్రమంలో సదరు వ్యక్తి అధికారులతో వాగ్వాదానికి దిగాడు. అనంతరం పోలీసుల సాయంతో ప్రహరీని కూల్చివేశారు. అయితే కూల్చివేసిన ప్రాంతంలోనే కబ్జాదారుడు సాయంత్రానికి ప్రహరీని తిరిగి నిర్మించారు. స్థానికంగా సదరు స్థలం విలువ రూ.10కోట్లు పలుకుతుందన్నారు. విలువైన స్థలాన్ని అధికారులు కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

సునీతారెడ్డిని కలిసిన కాంగ్రెస్ నేతలు



కుత్బుల్లాపూర్: మల్కాజ్‌గిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని బుధవారం కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన పోలింగ్, నమోదైన ఓట్లు, పార్టీ విజయావకాశాలపై ఈ సందర్భంగా చర్చించారు. డివిజన్ల అధ్యక్షులు, సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ డివిజన్ సౌభాగ్యనగర్‌లోని అలువేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉదయం 10.30 గంటలకు శ్రీకృష్ణ ఉత్సవ విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజారోహనం, సప్తావరణం, శ్రీపుష్ప యాగం నిర్వహించారు. అర్చకులు యతిరాజు, కృష్ణశర్మ, వెంకట రమణయ్య చార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

‘ఇకపై లోప్రెషర్ సమస్య తలెత్తదు’

చింతల్ సెక్షన్ మేనేజర్ పూజిత


మారుతీనగర్ నాలా సమీపంలో జరుగుతున్న తాగునీటి పైపులైన్ పనులు

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ పరిధిలో తాగునీటి సరఫరాను మెరుగు పరిచేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని విజయనగర్ కాలనీ, మారుతీనగర్‌లలో కొన్ని నెలలుగా లోప్రెషర్‌తో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై స్థానిక సంక్షేమ సంఘాల ప్రతినిధులు జలమండలి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన అధికారులు మారుతీనగర్ నాలా సమీపంలో పైపులైన్‌కు నూతనంగా వాల్వ్‌ను అమర్చడంతో పాటు పైపులైన్ సామర్థ్యాన్ని పెంచారు. దీంతో లోప్రెషర్ సమస్య తలెత్తకుండా సరిపడా నీరు సరఫరా అవుతుందని చింతల్ సెక్షన్ మేనేజర్ పూజిత తెలిపారు.

ఎట్టకేలకు మురుగు సమస్యకు పరిష్కారం


జర్నలిస్ట్‌కాలనీలో మ్యాన్‌హోల్‌ను గల్పర్‌తో శుభ్రం చేయిస్తున్న దృశ్యం

నిజాంపేట్: కొన్ని రోజులుగా స్థానికులు ఎదుర్కొంటున్న మురుగు సమస్య ఎట్టకేలకు పరిష్కారానికి నోచుకుంది. నిజాంపేట్ జర్నలిస్ట్ కాలనీ రోడ్డులోని సాయిబాబా ఆలయం సమీపంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ జామై మురుగు రోడ్లపై పారడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారులు ఎన్నికల బిజీలో ఉండటంతో వారి దృష్టికి తీసుకువెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదు. ఇటీవల ఎన్నికల ముగియడంతో కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ టేకుల ప్రవీణ్‌రెడ్డి బుధవారం అధికారులతో మాట్లాడి డ్రైనేజీ మ్యాన్‌హోల్‌ను గల్పర్‌తో శుభ్రం చేయించడంతో మురుగు ప్రవాహానికి అడ్డుకట్ట పడింది. మురుగు సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేఎం ప్రతాప్‌కు ఆహ్వానం


ప్రతాప్‌ను ఆహ్వానిస్తున్న తమిళియన్ అసోసియేషన్ సభ్యులు

కుత్బుల్లాపూర్: తమిళియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 19న సుభాష్‌నగర్‌లోని శ్రీబాలమురుగన్ కుమారస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ కమిటీ సభ్యులు బుధవారం మాజీ డీసీసీ అధ్యక్షుడు కె.ఎం.ప్రతాప్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠాపనకు రావాలని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కొట్టాయి స్వామి, ఉపాధ్యక్షుడు గణేషన్, ప్రధాన కార్యదర్శి చిన్నస్వామి, సంయుక్త కార్యదర్శి ఆనందన్, కోశాధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోండి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 సంవత్సరానికి గాను డిగ్రీ తొలి సంవత్సరంలో చేరే విద్యార్థులు దోస్త్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మీసేవ కేంద్రంలో కానీ, కళాశాలలో గాని రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. బీ.ఏ, బీకాం, కంప్యూటర్, బీబీఏ రిటైల్ ఆపరేషన్స్, బీఎస్సీలో ఎంపీసీ, ఎంపీసీఎస్, బీజెడ్సి గ్రూప్లో తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో 780 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే.!

మల్కాజ్‌గిరిలో ఎవరు గెలుస్తారనేదానిపై సర్వత్రా చర్చ



నిజాంపేట్: లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ గెలుపుపై అంచనాల్లో మునిగి తేలుతున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి పట్నం సునీతామహేందర్ రెడ్డి, బీజేపీ నుంచి మాజీ మంత్రి ఈటల రాజేందర్, బీఆర్ఎస్ నుంచి రాగిడి లక్ష్మారెడ్డిలు బరిలో నిలిచారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన నాటి నుంచి ముగిసేంత వరకు రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు శాయశక్తులా కృషి చేశారు. తాజాగా సోమవారం ఎన్నికలు ముగియడంతో గెలుపు అంచనాలను బేరీజు వేసుకుంటున్నారు. ఎక్కడ చూసినా ఆయా పార్టీల నాయకులు తమ అభ్యర్థే గెలుపొందుతారంటూ స్థానికంగా ప్రచారం చేసుకోవడం కనిపిస్తోంది.

గత అభివృద్ధిపై బీఆర్ఎస్ ఆశలు..

గత పదేళ్లుగా బీఆర్ఎస్ అధికారంలో ఉండగా చేపట్టిన అభివృద్ధి పనులే గెలిపిస్తాయని ఆ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి వ్యక్తం చేస్తున్నారు. లోక్‌సభ స్థానం పరిధిలోకి వచ్చే కుత్బుల్లాపూర్, మేడ్చల్, మల్కాజ్‌గిరి, ఉప్పల్ తదితర నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే ఎమ్మెల్యేలుగా ఉండటంతో తనకు లాభిస్తుందని ఆయన భావిస్తున్నారు. ముఖ్యంగా కుత్బుల్లాపూర్ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు, గత ప్రభుత్వ హయాంలో అమలు పరిచిన సంక్షేమ కార్యక్రమాలపై ఆశ పెట్టుకున్నారు.

ఆరు పథకాలే గెలిపిస్తాయంటున్న కాంగ్రెస్..

అధికార కాంగ్రెస్ అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి ఆరు గ్యారంటీలే గెలిపిస్తాయని ఆశాభావంతో ఉన్నారు. అంతేకాకుండా ఇటీవల మున్సిపల్, కార్పొరేషన్ల నుంచి ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరికలు తమకు లాభిస్తాయంటున్నారు. ఇప్పటికే ఉచిత బస్సు, రూ.500లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత కరెంట్ పథకాలతో లబ్ధి పొందిన ప్రజలు తమకు ఎన్నికల్లో బాసటగా నిలిచారని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

అంతా మోదీ మేనియాపైనే..

బీజేపీ నుంచి బరిలో దిగిన మాజీ మంత్రి ఈటల రాజేందర్ మోదీ హవానే గెలిపిస్తుందని పేర్కొంటున్నారు. ప్రచారంలో ఎక్కువగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకర్షించేందుకు యత్నించారు. అంతే కాకుండా ఆయన బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో మెజార్టీ బీసీ ఓటర్లు బీజేపీ వైపు మొగ్గు చూపారన్న పుకార్లు వినిపిస్తున్నాయి.

చీలిన మైనార్టీల ఓట్లు..

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్యనే మైనార్టీల ఓట్లు చీలి ఉంటాయని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. పార్లమెంట్ పరిధిలో చెప్పుకోదగ్గ స్థాయిలో మైనార్టీలు ఉన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనార్టీలకు పెద్దపీట వేసి సంక్షేమ పథకాలు అమలు చేసింది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సైతం వారికి రిజర్వేషన్లు కలిస్తామంటూ సముచిత స్థానం ఇస్తుండటంతో ఇరు పార్టీల మధ్యే మైనార్టీ ఓట్లు చీలి ఉంటాయన్నది సుస్పష్టం. దీంతో మైనార్టీ ఓటర్లే తమను గట్టెక్కిస్తారని కాంగ్రెస్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు పేర్కొంటున్నారు.

బస్తీలపై కాంగ్రెస్, బీఆర్ఎస్.. కాలనీలపై బీజేపీ.!

మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానంలో బస్తీ ఓటర్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాలపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా మాస్ ఓటర్లు తమ పార్టీలను ఆదరిస్తారని భావిస్తున్నారు. ఈ లోక్‌సభ పరిధిలో ఎక్కువగా బస్తీలు ఉండటం.. ఎక్కువగా ఆ ప్రాంతాల్లో ఓటింగ్ జరగడంతో వారి ఓట్లే గెలిపిస్తాయని భావిస్తున్నారు. ఇక కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌ల ఓటర్లపై బీజేపీ ఆశ పెట్టుకుంది.

కీలకంగా మారిన ఉత్తర భారతీయులు..

మల్కాజ్‌గిరి లోక్‌సభ నియోజకవర్గంలోని జీడిమెట్ల, దూలపల్లి, గాంధీనగర్, బాలానగర్ పారిశ్రామికవాడల పరిధిలోని వివిధ కంపెనీల్లో ఎక్కువగా ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చెందిన వారు కార్మికులుగా పని చేస్తున్నారు. అంతే కాకుండా రాజస్థాన్ వాసులు సైతం చెప్పుకోదగ్గ స్థాయిలో ఉన్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో వీరు ఓట్లు ఎవరికి పడ్డాయన్న దానిపై ప్రధాన పార్టీలు లెక్కలు పెట్టుకుంటున్నారు.

రాంరెడ్డినగర్‌లో ఓపెన్ నాలాలు నిర్మించాలి


అస్తవ్యస్తంగా మారిన రాంరెడ్డినగర్ నాలా


జీడిమెట్ల: ఓపెన్ నాలాలు పునరుద్ధరించాలని రాంరెడ్డినగర్ కాలనీవాసులు కోరుతున్నారు. సుభాష్‌నగర్ డివిజన్ రాంరెడ్డినగర్‌లో ఓపెన్ నాలా పూర్తిగా ధ్వసమవడంతో పాటు ఔట్‌లెట్ సరిగా లేకపోవడంతో మురుగు రోడ్డుపై పారుతోంది. దీంతో దుర్వాసన వెలువడుతుందని స్థానికులు చెబుతున్నారు. దీనికి తోడు దోమలు విపరీతంగా వృద్ధి చెంది రాత్రివేళల్లో ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని ఓపెన్ నాలాలు నిర్మించాలని కోరుతున్నారు. అధికారులు 300మీటర్ల మేర సర్వేచేసి పాల నాలాల స్థానంలో కొత్తగా అండర్‌గ్రౌండ్ నాలాలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా నాలా మూల మలుపుల వద్ద ఔట్‌లెట్‌లు మాత్రం నాణ్యంగా నిర్మించాలని కోరుతున్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి


సాధారణ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ నీలారెడ్డి

నిజాంపేట్: ప్రజలకు మెరుగైన వసతులను అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేయర్ కొలన్ నీలారెడ్డి అన్నారు. బుధవారం నిజాంపేట్ కార్పొరేషన్ 25వ సాధారణ సర్వసభ్య సమావేశం కమిషనర్ రామకృష్ణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్ పాల్గొన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 33 డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైపులైన్ పనులపై చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... స్థానికంగా నెలకొన్న సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పనులకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో–ఆప్షన్ సభ్యులు, ఇంజినీరింగ్, శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, వాటర్‌వర్క్స్, హార్టికల్చర్, ఎలక్ట్రికల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సద్గురు విద్యార్థులకు రసమయి బాలల పురస్కారం


పురస్కారం అందుకున్న సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు

నిజాంపేట్: నగరంలోని త్యాగరాయ గానసభలో మంగళవారం రాత్రి రసమయి బాలల ఉగాది పురస్కార కార్యక్రమం ఘనంగా జరిగింది. ప్రగతినగర్‌కు చెందిన సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థులు పూజ్యంత్, ప్రవ్య, ఆదిత్రిరెడ్డి, ఇషిత్, కృతికాన్స్ చిత్రలేఖనంలో కనబరిచిన ప్రతిభకు పురస్కారాలు అందుకున్నారు. విశ్రాంత హైకోర్ట్ జడ్జి చంద్రకుమార్, ప్రముఖ కూచిపూడి నాట్యగురువు భారతి, రసమయి సంస్థ అధ్యక్షుడు రాము లు విద్యార్థులకు అవార్డులను అందజేశారు. పురస్కారాలు అందుకున్న విద్యార్థులను సద్గురు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ ఫౌండర్ సత్యవోలు రాంబాబు, పూజితలు అభినందించారు.

వాటర్ వర్క్స్ లైన్‌మెన్ రాములు మృతి

చింతల్: కుత్బుల్లాపూర్ వాటర్ వర్క్స్ కార్యాలయంలో పనిచేస్తున్న లైన్‌మెన్ జె.రాములు బుధవారం ఉదయం మృతి చెందారు. జీడిమెట్ల సెక్షన్‌లో స్పెషల్ పర్పస్ ఎంప్లాయీగా పనిచేస్తున్న రాములు కేన్సర్ బారిన పడ్డారు. దీంతో నెల రోజులుగా ప్రత్యేక వైద్యం తీసుకుంటున్న ఆయన బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జలమండలి సీజీఎం, కుత్బుల్లాపూర్ జలమండలి జీఎం శ్రీధర్‌రెడ్డి, సిబ్బంది రాములు మృతదేహానికి నివాళులర్పించి కుటుంబీకులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. డీజీఎంలు రాజేష్, అప్పలనాయుడు, విష్ణు ప్రసాద్, ఎస్ఓ విజయ కుమారి, రెవెన్యూ ఆఫీసర్ రామచందర్, మేనేజర్లు శివ ప్రసాద్, రవి, పూజిత, అనూష, రోహిణి, రమ్య భారతి, డివిజన్ అధికారులు రాములు సత్యనారాయణ, గణేష్, లాలప్ప తదితరులు నివాళులర్పించారు.


రాములు (ఫైల్)